క్లుప్తంగా

అంగన్‌వాడీలకు నేటి నుంచి శిక్షణ కార్యక్రమం

మద్దిపాడు: మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లకు సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీడీపీఓ ఇవాంజిలిన్ తెలిపారు. మద్దిపాడు మండలానికి చెందిన రెండు బ్యాచ్‌ల అంగన్‌వాడీ వర్కర్లకు గుండ్లాపల్లి ఉన్నత పాఠశాలలో, నాగులుప్పలపాడు మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు అక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చీమకుర్తి మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, సంతనూతలపాడు మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు చిలకపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఉంటుందని సీడీపీఓ తెలిపారు. కార్యక్రమంలో పిల్లల ఎదుగుదల, వారి సమగ్రాభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వనున్నట్లు సీడీపీఓ వివరించారు.

నిధుల దుర్వినియోగం ఆరోపణలు అవాస్తవం

సంతనూతలపాడు: మండలంలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి నిధులు దుర్వినియోగం అయినట్లు టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు, కూలీలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కొణిజేడు డొంక రోడ్డు, స్థానిక పశువుల ఆస్పత్రి వద్ద నుంచి రెడ్డి కుంట వరకు ఒక వర్క్ ఐడీ, రెడ్డి కుంట నుంచి ఎస్ఎస్పీ వరకు ఒక ఐడీ రూపొందించి పూర్తిగా శిథిలావస్థకు చేరి పాడైపోయిన రోడ్లను మాత్రమే గ్రామస్తుల కోరిక మేరకు నిర్మించినట్లు తెలిపారు. అధికారులు రాడిఫికేషన్ చేసి కూలీలతో పని చేయించి లేబర్ కాంపోనెంట్ రూపంలో మాత్రమే నిధులు వెచ్చించినట్లు వివరించారు. కానీ, రోడ్ల నిర్మాణం జరగకుండానే, ఎటువంటి మెటీరియల్ కాంపోనెంట్ బిల్లు చేయకుండానే అవకతవకలకు పాల్పడినట్లు టీడీపీ నేతలు ఆరోపించడం తగదని అన్నారు.

పేకాట శిబిరంపై దాడి


పేకాటాడుతూ పట్టుబడిన వారితో పోలీసు సిబ్బంది

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మబ్రోలు గ్రామ సమీపంలో పేకాటాడుతున్న వారిపై దాడి చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ.7,450 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

అర్చకులకు పంచాంగాల అందజేత


అర్చకులకు పంచాంగాలు అందిస్తున్న మద్దాళి మాధవరావు

చీమకుర్తి: అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు చేతుల మీదుగా అర్చకులకు ఆదివారం పంచాంగాలు అందించారు. చీమకుర్తిలోని నగరేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రానున్న విశ్వావసు నామ తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని చీమకుర్తి మండలంలోని అర్చకులను గౌరవించి పంచాంగాలు అందజేయడంతో పాటు శాలువాలతో సత్కరించి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నగరేశ్వరస్వామి ఆలయ సిబ్బందితో పాటు అర్చకులు పాల్గొన్నారు.

14 కేంద్రాల్లో నవభారత సాక్షరతా పరీక్షలు


చదలవాడలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న సురేఖ

నాగులుప్పలపాడు: ఉల్లాస్ – నవభారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా 14 కేంద్రాల్లో ఆదివారం పరీక్షలు నిర్వహించినట్లు ఏపీఎం నరేంద్ర కుమార్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉండి నిరక్షరాస్యులైన లబ్ధిదారులను గుర్తించి వారికి గత మూడు నెలల నుంచి వలంటీర్ టీచర్ల ద్వారా చదవడం, రాయడం, చిన్న చిన్న అంకెలను గుర్తించడం నేర్పించడం జరిగిందని ఏపీఎం తెలిపారు. మండలంలో మొత్తం 977 మందికిగానూ 943 మంది మహిళలు ఈ పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. పరీక్ష నిర్వహణను అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ సురేఖ పరిశీలించారు. పరిశీలనలో సూపర్‌వైజర్ జ్యోతి, సీసీలు రామకృష్ణ, రవణమ్మ, అరుణ, కవిత తదితరులు పాల్గొన్నారు.


జిల్లా గ్రంథాలయంలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న పాఠకులు



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


వజ్జిరెడ్డిపాలెంలో నినాదాలు చేస్తున్న కంకణాల ఆంజనేయులు, స్థానికులు

చెరగని ముద్ర.. భగత్‌సింగ్

- ఘనంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభ

ఒంగోలు టౌన్: భారత జాతీయోద్యమంలో ఎంతో మంది వీరులు అశువులు బాసినప్పటికీ అమరుడు భగత్‌సింగ్ ఒక చెరగని ముద్రగా నిలిచిపోయారని జనసాహితీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జీవీ కృష్ణయ్య అన్నారు. అమరవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభను స్థానిక గిరిజన బాలుర వసతి గృహంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో మతరాజకీయాలు పాలకుల చేతిలో ఆయుధాలుగా మారాయని, మతోన్మాద శక్తులు ఫాసిస్ట్ శక్తులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు మత రాజకీయలను తిప్పికొట్టాలని, సామరస్యం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువకులు డైనమిక్‌లాంటి వారని, వారిలో చైతన్యమనే నిప్పురవ్వను రగిలిస్తే సమసమాజం సాధ్యమవుతుందని అన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ తిప్పారెడ్డి వెంకటేశ్వరరెడ్డి భగత్‌సింగ్ కాలం నాటి పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో జనసాహితీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖాదర్ బాషా, డాక్టర్ శాంతికుమార్, డీవీ ప్రసన్న, వెంకటేశ్వరరావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన వీరుడు.. భగత్‌సింగ్...

ఇరవై మూడేళ్ల చిరుప్రాయంలోనే దేశం కోసం ఉరికంబాన్ని చిరునవ్వుతో ముద్దాడిన భగత్‌సింగ్ దేశ ప్రజలలో నిత్యం స్ఫూర్తి నింపుతున్నాడని బహుజన ఉపాధ్యాయ సంఘ నాయకుడు జాలాది మోహన్ అన్నారు. ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బ్రిటీష్ ముష్కరుల చెర నుంచి భరతమాతకు విముక్తి కల్పించేందుకు ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో చావును సైతం సంతోషంగా స్వీకరించిన అమరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అని, వారి పోరాట స్ఫూర్తిని నేటి తరం యువకులు అధ్యయనం చేసి ఆచరించాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రసుత పరిస్థితులు బాధాకరంగా ఉన్నాయని, దేశ ఉన్నతికి కారణమైన సామరస్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలు పోరాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది లక్ష్మి, ఇమ్మానియేలు, పాఠకులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న డీవైఎఫ్ఐ నాయకులు

ఇంక్విలాబ్ నినాదాన్ని అందించిన వీరుడు.. భగత్‌సింగ్

ఇంక్విలాబ్ నినాదాన్ని జాతికి అందించిన సర్దార్ భగత్‌సింగ్ జీవితం దేశ యువతకు ఆదర్శనీయమని ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం నిర్వహించిన భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్య, ఉపాధి కోసం దేశంలో ఉద్యమం నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, యువజన విద్యార్థి నాయకులు ప్రభాకర్, పవన్ కళ్యాణ్, గులాం హుసేన్, రామాంజి, పురిని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ కాగడాల ప్రదర్శన...

జలియన్ వాలా బాగ్ దారుణాన్ని చూసి రగిలిపోయిన భగత్‌సింగ్ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలన్న నినాదంతో పోరాటం చేశారని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ అన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్, భగత్ సింగ్ అమర్ రహే నినాదాలతో ఒంగోలులోని అంబేడ్కర్ భవనం నుంచి చర్చి సెంటర్ వరకు ఆదివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. బి.పద్మ, ఆర్.మోహన్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, హనుమంతరావు, శ్యాం, మహేశ్వరి, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ఫాసిజాన్ని ఓడించడమే భగత్‌సింగ్‌కు నివాళి...

కార్పొరేట్ ఫాసిజాన్ని ఓడించడమే అమరవీరులకు నిజమైన నివాళి అర్పించడం అవుతుందని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఒంగోలులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు ఆదివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, నాయకులు కత్తి కళ్యాణ్, డాక్టర్ సుధాకర్, నూనె జగన్‌మోహన్‌రావు, ఎంఏ సాలార్, ఏఎల్ ప్రసాద్, పిన్నికి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో...

డీవైఎఫ్ఐ ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భగత్ సింగ్ నగర్లో ఆదివారం అమరవీరుల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. లౌకికవాదం, సామ్యవాదం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చివరిదాకా పోరాడారని చెప్పారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేఏఫ్ బాబు, నాయకులు విజయలక్ష్మి, తంబి శ్రీనివాస్, నాని, వెంకటరావు, రామకృష్ణ, గుంజి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులోని గిరిజన బాలుర వసతి గృహంలో ప్రసంగిస్తున్న జీవీ కృష్ణయ్య

భగత్‌సింగ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి...

సంతనూతలపాడు: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆదర్శాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సుందరయ్య భవన్లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ మండల నాయకుడు పి.శ్రీమన్నారాయణ, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.మాలతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో...

భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మండలంలోని పేర్నమిట్ట శాంతినగర్లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులో భగత్‌సింగ్ పోరాటాలు చేశారని వివరించారు. కానీ, ప్రస్తుతం కార్పొరేటర్లు, మతోన్మాదులు, సామ్రాజ్యవాదంతో కలిసి దేశ సంపదను కొల్లగొడుతున్నారని సుబ్బారావు ఆరోపించారు. వీరికి వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అను వెంకట సుబ్బారావు, దాసరి చినబాబు, టీ సుబ్బారావు, చిన్న శేషయ్య, కై లా అవినాష్, జార్జి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: మండలంలోని వజ్జిరెడ్డిపాలెంలో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.స్వామిరెడ్డి, జి.దశరథ, కోటా జాలరామిరెడ్డి, జి.శంకర్, డి.గోపి, కె.నాని, జి.సంజయ్, కె.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు


పేర్నమిట్టలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


ఒంగోలు చర్చిసెంటర్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ నాయకులు


సంతనూతలపాడులో మాట్లాడుతున్న నెరుసుల వెంకటేశ్వర్లు

చుండూరు రవిబాబును కలిసిన వైస్ ఎంపీపీ

ఒంగోలు సిటీ: స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబును గుండాయపాలెంకు చెందిన వైస్ ఎంపీపీ ఏడుకొండలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఒంగోలు మండల నాయకులతో రవిబాబు సమావేశం నిర్వహించారు. పార్టీ ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, పార్టీ బలోపేతం, మండల కమిటీ, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అయ్యల కొండలరావు, వాలేటి ప్రవీణ్, సైకం చిరంజీవి, తమ్మా నాగరాజు, అయ్యల నాగరాజు, నాయుడు శ్రీను, కర్రి నాగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చుండూరు రవిబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైస్ ఎంపీపీ ఏడుకొండలు

పాఠశాలకు సామగ్రి అందజేత

కొత్తపట్నం: స్థానిక డీడీ కాలనీలోని ఎలిమెంట్రీ స్కూల్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఆదివారం సామగ్రి అందజేశారు. స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి స్కూల్ హెచ్‌ఎం సూర్యకుమారి అధ్యక్షత వహించగా, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ వారు బీరువా, ఫ్యాన్లు, కుర్చీలు ఉచితంగా అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో–2 పద్మావతి మాట్లాడుతూ పాఠశాలకు ఫ్యాన్లు, కుర్చీలు, బీరువా కావాలని అడిగిన వెంటనే లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ వారు మంచి మనసుతో సహాయం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్కూల్ తరఫున వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చార్లస్‌బాబు, హనుమంతరావు, మాధవి, మేరి జయలత, వేణు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ అధ్యక్షుడు ఈదర వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గ్రంధే పార్థసారథి, కార్యదర్శి బొమ్మిశెట్టి లక్ష్మణస్వామి, క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్, తమ్మన ఆంజనేయులు, పి.జనార్దన్, గోపాల్, విజయ, కోడూరు కిసోర్, నందకుమార్, రాంబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలకు సామగ్రి అందజేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ సభ్యులు

సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

ఒంగోలు టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకునేలా విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు చార్జీలను వ్యతిరేకిస్తూ ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎల్బీజీ భవనంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వ నిర్వాకం వలన 25 ఏళ్లలో ప్రజల మీద లక్ష కోట్ల రూపాయల భారం పడుతోందని విమర్శించారు. పెంచిన ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, అవసరమైతే ప్రభుత్వమే వాటిని భరించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 28వ తేదీ ఒంగోలులోని విద్యుత్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగర కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు ప్రసంగిస్తూ విద్యుత్ చార్జీలు పెంచేది లేదని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. వచ్చీరాగానే ప్రజల మీద 15,484 కోట్ల రూపాయల భారం వేయడం దుర్మార్గమని అన్నారు. స్మార్ట్ మీటర్ల వలన కార్పొరేట్లకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందన్నారు. సదస్సులో జి.ఆదిలక్ష్మి, ఎస్.జ్యోతి, వేమూరి సుబ్బారావు, అబ్బూరి లక్ష్మీనారాయణ, దామా శ్రీనివాసులు, శేషయ్య, తంబి శ్రీనివాసరావు, ఎస్‌డీ హుసేన్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు

సాదాసీదాగా చీమకుర్తి మండల పరిషత్ సమావేశం

చీమకుర్తి రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 16వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఇప్పటివరకు మండల పరిధిలో మండల పరిషత్ నిధులతో 902 పనులకుగానూ సుమారు 26 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. 12 కోట్ల రూపాయలతో మండలంలో తారురోడ్లు వేసినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి నూతన స్తంభాల ఏర్పాటుకు విద్యుత్‌శాఖ ద్వారా కోటీ ఇరవై ఐదు లక్షల రూపాయలతో పనులు చేయించినట్లు తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు వారి గ్రామాల అభివృద్ధి కోసం సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనుల నిమిత్తం ఎంపీపీకి అర్జీలు అందజేశారు. సమావేశంలో ఎంపీడీఓ కె.రాఘవేంద్ర, సర్పంచులు, ఎంపీటీసీలు, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి మండలంలో 900 మంది హాజరు...

చీమకుర్తి రూరల్: మండలంలో ఉల్లాస్ మదింపు పరీక్షకు 900 మంది అభ్యాసకులు హాజరవగా, 8 మంది గైర్హాజరైనట్లు వయోజనవిద్య ఉల్లాస్ కన్వీనర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. అభ్యసించిన వారికి ఆదివారం 18 అంగన్‌వాడీ కేంద్రాల్లో మదింపు పరీక్ష నిర్వహించినట్లు ఎంపీడీఓ కె.రాఘవేంద్ర తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ–1 నరసింహారావు, ఎంఈఓ–2 శివాజీ, ఏపీఎం రాజ్యలక్ష్మి సందర్శించి పర్యవేక్షించారు.

మత సామరస్యాన్ని చాటిచెప్పే ఇఫ్తార్ విందు

ఒంగోలు టౌన్: రంజాన్ మాసంలో ఎంతో నిష్ఠతో ఉపవాసాలు పాటించే ముస్లింలు ఇచ్చే ఇఫ్తార్ విందులు మత సామరస్యాన్ని చాటి చెబుతాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. ఆదివారం జిల్లా పోలీసు కళ్యాణ మండపంలో ముస్లిం పోలీసు సిబ్బందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు సమాజంలో సోదర భావాన్ని పెంపొందిస్తున్నాయన్నారు. ఏ మతానికి సంబంధించిన పండుగ అయినా దాని వెనక యావత్ ప్రజల కోసం సందేశం ఉంటుందని చెప్పారు. రంజాన్ మాసం త్యాగాలకు, దాన ధర్మాలకు, దైవ చింతనకు ప్రతీక అని చెప్పారు. మనసులోని చెడు ఆలోచనలను కట్టిపెట్టి, చెడు నడత మానుకోవడానికి రంజాన్ ఉపవాసాలు దోహదం చేస్తాయన్నారు. ప్రశాంత వాతావరణంలో ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంతో చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ రాఘవేంద్ర, ఆర్ఐలు సీతారామి రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మౌజన్ ఎస్‌కె అబ్దుల్లా దువా చేశారు.


ఇఫ్తార్ విందులో దువా చేస్తున్న ఎస్పీ దామోదర్

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన భూమిరెడ్డి రమణమ్మ

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డిని ఒంగోలులోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతిచెందిన నేపథ్యంలో సుబ్బారెడ్డిని రమణమ్మ కలిసి పరామర్శించారు. ఇటీవల జనసేన పార్టీ మహిళా నాయకులు తనపై దాడిచేసిన విషయాన్ని సుబ్బారెడ్డి దృష్టికి రమణమ్మ తీసుకెళ్లారు. ఆమె వెంట సాధన విజయలక్ష్మి ఉన్నారు.


వైవీ సుబ్బారెడ్డితో భూమిరెడ్డి రమణమ్మ